# ెత్తుటి చారలు

త్యాన్ని దెబ్బతీస్తుంది. పోలీసు కూడా ఓ మనిషే అన్న భావనతో ఈ సమస్యకు మరోకోణంలోంచి చూస్తే పోలీసులోంచి అప్పుడప్పుడూ తొంగిచూసే అమానుషత్వాన్ని అర్థం చేసుకునే అవకాశం లేకపోలేదు. ఎంతటి కఠిన నేరస్తులనైనా సరే '**corrective measures**' ద్వారా మార్చాలనే దృక్పథంతో మన 'క్రిమినల్ జురిస్ప్రెడెన్స్ సిస్టం' వ్యవహరిస్తున్నప్పుడు —ఆ విశాలదృక్పథాన్ని కొంత సానుభూతితో విస్తరింపజేసి తప్పుచేసే పోలీసులను చట్టపరంగా, కరెక్టివ్ మెజర్స్ ద్వారా మార్చే ప్రయత్నం బలంగా చేయాలి.

ప్రజలు పోలీసును హితుడిగా, సన్నిహితుడిగా భావించే రోజు ఎప్పుడొస్తుందో ఊహించడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టం. కానీ ఆ రోజు కోసం, ఆ మధురక్షణంకోసం పోలీసు ఎంతటి త్యాగానికైనా సిద్ధపడడంలోనే ఒక ఆనందం ఉంది. అప్పుడే ఆ ఉద్యోగానికి ఒక అర్థమూ, ఒక ప్రయోజనమూ చేకూరుతుంది.

బలాన్ని అసహాయుడిమీద, బలహీనుడి మీదా ప్రయోగించడం ఆటవిక నీతికంటే అధమాధమం.

ప్రజలు చట్టంద్వారా పోలీసులు బలోపేతం చేసింది వారి సమష్టి బలంకోసం! అధికారం వ్యక్తికి సంబంధించినది కాదు, వృత్తికి సంబంధించినదనే అవగాహన పోలీసుకు అత్యావశ్యకరం!

ప్రజలూ, పోలీసులూ చట్టపరిధిలో వ్యవహరించక తప్పదు. చట్టాన్ని అమలుపరిచే బాధ్యత ప్రజలు పోలీసులకు అప్పగించారు కాబట్టి ఏ మాత్రం ఉల్లంఘన జరిగినా ప్రజలు ఊరుకోరు. కంచె చేను మేయడానికి ప్రయత్నిస్తే ఎవరైనా ఊరుకుంటారా!?

---

# పోలీసుల 'అవినీతే' ప్రాణాలు తీస్తున్నది

కె. బాలగోపాల్



లాకప్ హత్యలు జరుగుతున్న సంగతి పోలీసు యంత్రాంగం సహితం కాదనలేదు. కాబట్టి వారి వైపు నుండి కూడా దానికి కారణాలు, నివారణోపాయాలు ఫలానా అన్న విశ్లేషణ, సూచనలు వస్తుంటాయి. హక్కుల ఉద్యమం కూడా ఆ విశ్లేషణ చేస్తున్నది.

కానీ ఈ రెండు విశ్లేషణలలో కనిపించే కారణాలు వేరు. నివారణోపాయాలువేరు. పోలీసు నిపుణుల విశ్లేషణ ప్రధానంగా 'ఒత్తిడుల' మీద దృష్టి పెడుతుంది. పోలీసులకు పని ఒత్తిడి ఎక్కువ. కావలసినంత మంది సిబ్బంది లేరు. మరొక వైపు నేరాలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. అందువల్ల వివరంగా, చట్టబద్ధంగా నేర పరిశోధన జరపడం సాధ్యం కాక లాకప్పులో హింసకు పాల్పడుతుంటారని ఈ విశ్లేషణ చెపుతుంది.

ఇంకొక 'ఒత్తిడి' న్యాయస్థానాలు సాక్ష్యాలకు శించే ప్రమాణా సంబంధించినది. నేరం సంపూర్ణ రుజువయిందని నమ్మడానికి న్యాయస్థానాలు నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం నేర పరిశోధన జరపడం చాలా కష్టం. కాబట్టి లాకప్పులో కొట్టి, తన్ని అదే శిక్ష అని భావించే తప్పుడు ఆలోచనలకు పోలీసు సిబ్బంది లోనవుతున్నారని అంటారు.

మూడవ 'ఒత్తిడి' రాజకీయ నాయకులు, ఇతర ముఖ్యులు పెట్టేది. ఈ ఒత్తిడి వల్ల పోలీసు సిబ్బంది సక్రమంగా పని చేయలేక అడ్డదారులు తొక్కుతున్నారని ఈ వ్యాఖ్య చెపుతున్నది.

పోలీసు అత్యాచారాల గురించి ఆందోళన చేస్తున్న హక్కుల సంఘాల దృష్టిలో ఆ.అత్యాచారాలకు కారణం మరీ ఇంత అమాయకమైనది కాదు. గత్యంతరం లేని, నిస్సహాయమైన స్థితిలో మాత్రమే పోలీసులు హింసకు పాల్పడడం లేదు.

రాజకీయ నాయకుల జోక్యం అనేది కూడా కేవలం ఏకపక్షంగా పోలీసు వ్యవస్థ పైన రుద్దబడేది కాదు. పోలీసు సిబ్బంది సైతం దానిని ఆహ్వానిస్తారు. దానివల్ల వాళ్ళకు ప్రయోజనాలు చాలా ఉంటాయి.

న్యాయస్థానాలు నిర్దేశించే ప్రమాణాలు అవాస్తవికమైనవి అనే కంటే వాటిని అందుకోవడానికి అవసరమైన సామర్థ్యాన్ని పోలీసు వ్యవస్థ పెంపొందించుకోవడం లేదనడం సరిగ్గా ఉంటుంది. అమాయకులకు పొరపాటున కూడా శిక్షపడకూడదనే ప్రమాణంతో న్యాయస్థానాలు నియమాలను రూపొందించాయి. అది న్యాయమైన ఆరాటమే. ఆ ప్రమాణాలకు తగినట్టు నేర పరిశోధన చేయాలంటే దానికి తగిన సామర్థ్యం, నేర్పరితనం పోలీసు వ్యవస్థ అలవలరచుకోవాలి. ఆ దిశగా ప్రయత్నమేమీ చేయకుండా న్యాయవ్యవస్థ మీద తప్పు పెట్టి చిత్రహింసలను పరోక్షంగా సమర్థించుకోవడం క్షంతవ్యంకాదు.

నిజానికి కస్టడీ హింసకు వేరే ఎన్ని కారణాలున్నా అన్నింటికంటే ముఖ్యమైనది పోలీసు వ్యవస్థలోని అవినీతి, బలవంతుల పట్ల, ధనవంతుల పట్ల పక్షపాతం.

దొంగతనం, డెకాయిట్ మొదలయిన కేసులలోనే లాకప్పులో చిత్రహింసలు ఎక్కువగా అమలు అవుతుంటాయి. లాకప్పుల హత్యల మృతులలో ఈ కోవకు చెందిన కేసుల ముద్దాయిలే ఎక్కువ ఉంటారు. ఇది కాకతాళీయం కాదు. ఆస్తి సంబంధమైన నేరాల పరిశోధనలోనే పోలీసులకు ఆదాయం ఉంటుంది. దొంగిలించిన వాళ్ళను హింసించి వసూలు చేసుకోవచ్చు. పోగొట్టుకున్న వారి దగ్గర 'ప్రోత్సాహకం' వసూలు చేసుకోవచ్చు. రేప్ కేసులో ముద్దాయిని హింసిస్తే ఏమొస్తుంది ?

డబ్బులు లేక ఇతరత్రా ప్రయోజనాలు అందియ్యగల బలవంతుల • పురమాయింపు మీద పోలీసులు పాల్పడే హింస చాలా ఉంటుంది. రాజకీయ నాయకుల 'జోక్యం'— 'ఒత్తిడి' అంటూ పోలీసు ప్రముఖులు విసుక్కుంటుంటారు. కానీ ఈ కమైన జోక్యాన్ని గురించి మాట్లాడరు.

నేరాలు పెరిగిపోతున్నాయనడాన్ని పోలీసుల హింసకు ఒక కారణంగా చూపించి సమర్థించాలని చూడడం ప్రమాదకరమైన విషయం. నేరాలకు కారణం, పరిష్కారం ప్రధానంగా సమాజంలో వెతకాలి. పోలీసు వ్యవసకు ఉండే పాత్ర స్వల్పమైనదే. ఆ పాత్రను పోలీసు వ్యవస్థ ప్రజల హక్కులను గౌరవించే పద్ధతిలో నిర్వహిస్తేనే అందరికీ మంచిది. ఆ పైన నేరాలను అరికట్టే కర్తవ్యాన్ని సామాజిక రాజకీయ కృషికి వదిలేయాలి.